సాక్షి ఖమ్మం

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



నాడు వైఎస్సార్ హయాంలో..

దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు వైరా రిజర్వాయర్ అభివృద్ధికి నోచుకోగా మళ్లీ ఇన్నాళ్లకు నిధులు మంజూరయ్యాయి. 8లో



సమగ్రంగా వ్యర్థాల నిర్వహణ

చెత్త సేకరణ సమయంలోనే జాగ్రత్తలు వహిస్తే వ్యర్థాల నిర్వహణ మెరుగవుతుందని జిల్లా ప్రత్యేకాధికారి గౌతమ్ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం 32°/25°

వాతావరణం

జిల్లా అంతటా శుక్రవారం ఉదయం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదైనా మధ్యాహ్నానికి కాస్త పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు వైరాలో అమృత్ 2.0 పథకం పనులతోపాటు 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అతర్వాత 12–30గంటలకు భట్టి స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో ఆలయం వద్ద స్నానఘట్టాలు, చెక్‌డ్యాం, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, అనంతరం వైరా రిజర్వాయర్ రిటైనింగ్ వాల్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

మంత్రి పొంగులేటి..

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ బీట్ పరిధిలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటతారు. అనంతరం అశోక్‌నగర్‌లో డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు పాల్వంచలో సింథటిక్ టెన్నిస్ కోర్టు, కలెక్టరేట్‌లో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తారు. ఆపై ఏన్కూరు మండలంలో సీతారామ ప్రాజెక్టు కాల్వ పనులను పరిశీలిస్తారు.


పంద్రాగస్టుకు ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: స్వాతంత్య్ర దినోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పోలీస్ పరేడ్ మైదానంలో ఈనెల 15న జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. శాఖల వారీగా అభివృద్ధి పనుల వివరాలతో శకటాలు సిద్ధం చేయాలని సూచించారు.

హైడల్ ప్రాజెక్టును సందర్శించిన సీఈ

కూసుమంచి: మండలంలోని పాలేరు మినీ హైడల్ ప్రాజెక్టును గురువారం నాగార్జునసాగర్ విద్యుత్ కేంద్రం సీఈ మంగేష్ పరిశీలించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రాజెక్టును సందర్శించిన నేపథ్యాన ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. దీంతో సీఈ గురువారం ప్రాజెక్టును సందర్శించి అధికారులతో సమీక్షించారు. గత కొన్నేళ్లుగా జరిగిన విద్యుత్ ఉత్పత్తి, ప్రస్తుత మరమ్మతులపై ఆరా తీసిన ఆయన సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తేలడంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి పొంగులేటితో సమావేశమయ్యేందుకు సీఈ ఖమ్మం వెళ్లారు.

సీహెచ్‌సీని పరిశీలించిన అధికారులు



లీకేజీలను పరిశీలిస్తున్న డీఈ, తదితరులు

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్లాబ్ నుంచి నీరు లీక్ అవుతుండడం.. ఆస్పత్రిలో మరుగుదొడ్లకు నీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈనేపథ్యాన గురువారం డీఈ విద్యాసాగర్, అసిస్టెంట్ ఇంజనీర్ వికాస్ పరిశీలించారు. స్లాబ్ లీకేజీకి గల కారణాలను తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య పెరిగిన నేపథ్యాన మరిన్ని వసతులు కల్పించడంపై సమీక్షించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్.వీ.ఎస్ సాగర్, సూపర్‌వైజర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సాగు సందడి



వరి నాట్లు వేస్తున్న మహిళలు

గత రెండు నెలల్లో సాధారణానికి మించి వర్షపాతం

- ఈనెలలోనూ జోరుగా వానలు
- జలాశయాల్లోకి సమృద్ధిగా చేరిన నీరు
- ఊపందుకున్న పంటల సాగు

ఖమ్మంవ్యవసాయం: విస్తారంగా కురుస్తున్న వానలు పంటల సాగుకు ఊపునిచ్చాయి. జూన్, జూలైతో పాటు ఈనెలలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జూన్, జూలైల్లో సాధారణానికి మించి వర్షపాతం నమోదు కాగా జూలై వానలతో జలాశయాల్లోకి నీరు చేరింది. ఇక ఈనెల ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాలు నిండుకుండల్లా మారి భూగర్భ జలాలు పెరగడమే కాక పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ ఎడమ కాల్వకు నీరు విడుదల చేశారు. దీంతో రైతులు ఆనందంగా పంటల సాగుపై దృష్టి సారించారు.

వడివడిగా సాగు

విస్తారంగా వానలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. జలాశయాల్లో నీరు చేరడం, భూగర్భం జలాలు పెరగమే కాక సాగర్ జలాలు అందడంతో వరి నాట్లలో వేగం పెరిగింది. జిల్లాలో అన్ని పంటలు కలిపి 5,96,662 ఎకరాల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2,92,924 ఎకరాల్లో సాగయ్యాయి. ప్రధాన పంట అయిన వరి సాధారణ లక్ష్యం 2,83,943 ఎకరాలకు గాను గురువారం వరకు 89,469 ఎకరాల్లో నాట్లు వేశారు. మరికొందరు రైతులు నారు సిద్ధం చేసుకున్నందున నాట్లలో నిమగ్నమయ్యారు. పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ జలాలు విడుదల చేయడంతో ఆయకట్టులో పంటల సాగు మరింత పెరగనుంది. ఇక పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 2.01 లక్షల ఎకరాలు కాగా ఇప్పటికే 1,86,008 ఎకరాల్లో, పెసర 14,334 ఎకరాల్లో సాగైంది. అలాగే, జిల్లాలో 88 వేల ఎకరాల్లో మిర్చి సాగవుతుందని భావిస్తుండగా రైతులు నారు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే, ఇటీవల వర్షాలతో అక్కడక్కడ లోతట్టు భూముల్లో పత్తి, పెసర పైర్లలో నీరు చేరగా నీటి తొలగింపు, యజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.

గురువారం నాటికి జిల్లాలో ప్రధాన పంటల సాగు (ఎకరాల్లో)

పంట	అంచనా	సాగు
వరి	2,83,943	89,469
మొక్కజొన్న	3,374	1,871
పత్తి	2,01,834	1,86,008
చెరకు	1,537	815
పెసర	15,357	14,334
కంది	1,005	292

గణనీయమైన వర్షపాతం

ఈ ఏడాది వానాకాలం ఆరంభం నుంచే విస్తారంగా వానలు కురుస్తున్నాయి. జూన్ సాధారణ వర్షపాతం 124.6 మి.మీలు కాగా 198.8 మి.మీ.గా(60శాతం ఎక్కువ) నమోదైంది. జూలైలో సాధారణ వర్షపాతం 249.6 మి.మీ.కు గాను 303.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అంటే 50 శాతానికి పైగా అధిక వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నారు. ఇక ఈ నెల 8వ తేదీ(గురువారం) వరకు సాధారణ వర్షపాతం 56.8 మి.మీ.లు కాగా 128.7 మి.మీ.గా నమోదు కావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మేమే 'సీతారామ' పూర్తి చేస్తాం..



యాతాలకుంటలో టన్నెల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎమ్మెల్యేలు వెంకట్రావు, పాయం తదితరులు

- వైఎస్సార్ జలయజ్ఞంలో తలపెట్టిన ప్రాజెక్టు ఇది..
- ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి: సీతారామ ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంటలో టన్నెల్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి పనులను పరిశీలించిన ఆయన సీతారామ ప్రాజెక్టు ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ సురేష్‌కుమార్‌తో సమీక్షించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, భూసేకరణ, నీటి విడుదలకు జరుగుతున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. ఏడాదిలోగా టన్నెల్ పనులు పూర్తి చేస్తామని, భూసేకరణకు సంబంధించి రూ.4.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వివరించారు.

గత ప్రభుత్వ పాపాలే..

రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని అసెంబ్లీ సాక్షిగా బీఆర్‌ఎస్ నేతలు అబద్ధాలు చెప్పారని మంత్రి మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. రైతు ఆత్మహత్యలన్నీ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాపాలేనని చెప్పారు. అయితే, ఎక్కడైనా వివిధ కారణాలతో రైతులు మృతి చెందితే అవన్నీ ఆత్మహత్యలుగా చిత్రీకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

15న సీఎం చేతుల మీదుగా..

సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 15న సీతారామ ప్రాజెక్టులోని ఒక దశను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 1.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే కాక లంకాసాగర్, వైరా, మధిరలతో పాటు మరో ఏడు మండలాల్లో ఆయకట్టు స్థిరీకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు.

దివంగత వైఎస్సార్ హయాంలో..

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు జలయజ్ఞంలో భాగంగా రూ.2,400 కోట్లతో 3.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం, సాగర్ ఆయకట్టును స్థిరీకరించేలా ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టులను శ్రీకారం చుట్టారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పుడు ఏ గ్రామానికి వెళ్లినా ఇందిరమ్మ ఇళ్లు, వైఎస్సార్ ఇచ్చిన పట్టాలు చూపిస్తున్నారని తెలిపారు. అయితే, తెలంగాణ ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టు అంచనాలను రూ.18,500 కోట్లకు పెంచగా రూ.8వేల కోట్లు ఖర్చు పెట్టి రూ.975 కోట్లు బిల్లులు పెడింగ్‌లో పెట్టారని మండిపడ్డారు.

ధరణిపై ప్రజాభిప్రాయ సేకరణ

ధరణిలో అన్నీ లోపాలే ఉన్నా గత ప్రభుత్వం గొప్పలు చెప్పిందని మంత్రి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. తాము ముందు నుంచి చెబుతున్నట్లుగా ధరణిని బంగాళఖాతంలో కలిసేస్తామని చెప్పారు. ధరణితో చాలా మంది ఇబ్బంది పడగా, కుంభకోణాలు జరిగినందున ప్రజాభిప్రాయం సేకరణకు వెబ్‌సైట్ ప్రారంభించామని తెలిపారు. దీని స్థానంలో దేశంలోనే మోడల్ చట్టాన్ని తీసుకొస్తామని వెల్లడించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి తెల్లరేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డు అందిస్తామని, ఈ నెలాఖరున 4.30 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామన్నారు. కాగా, సత్తుపల్లి మండలం కిష్టారంలో సింగరేణి పేలుళ్లతో దెబ్బతిన్న ఇళ్లను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, ఎస్.కే.మౌలాలీ, ఎం.డీ.కమల్‌పాషా, ఉడతనేని అప్పారావు, దొడ్డా శ్రీనివాసరావు, తుంబూరు కృష్ణారెడ్డి, గాదిరెడ్డి రాంబాబురెడ్డి పాల్గొన్నారు.

పట్టుబట్టి సీఎంను తీసుకొస్తున్నా..

- 'సీతారామ'తో లక్ష ఎకరాలకు సాగు నీరు
- సీఎం సభాస్థలిని పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సభాస్థలి మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన సీపీ సునీల్‌దత్, ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

వైరా: సీఎం రేవంత్‌రెడ్డిని పట్టుబట్టి వైరాకు తీసుకొస్తున్నానని.. దేశమంతా పండుగ జరుపుకునే పంద్రాగస్టు రోజునే సీతారామ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించేందుకు సీఎం వస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ పట్టు పరిశ్రమల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. వైరాలో సీఎం సభకు ఎంపిక చేసిన స్థలాన్ని పోలీసు కమిషనర్ సునీల్‌దత్, ఇతర అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీని సైతం వైరా వేదిక నుంచి సీఎం అమలుచేస్తారని తెలిపారు. అటవీ ప్రాంతంలో ఉన్న సీతారామ ప్రాజెక్ట్ మోటార్ల ట్రయల్ రన్ పూర్తి కాగా.. గోదావరి జలాలు వైరాకు రానున్నాయని చెప్పారు. దీంతో వైరా మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని లక్షకు పైగా ఎకరాల్లో పంటలకు సాగునీరు అందుతుందని తెలిపారు. అంతేకాక పనులన్నీ పూర్తయ్యాక కొత్తగూడెం, పినపాక, అశ్వరావుపేట నియోజకవర్గాల్లో మరో లక్ష ఎకరాలు సాగులోకి రానున్నాయని వివరించారు. కాగా, అధికారులు సమన్వయంగా విధులు నిర్వర్తిస్తూ సభకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కూడా సభాస్థలిని పరిశీలించారు. అంతేకాక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సభ నిర్వహణ, నాయకులతో పార్టీ శ్రేణుల తరలింపుపై చర్చించారు. ఈకార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఆర్అండ్‌బీ డీఈ హేమలత, ఏఈ విశ్వనాథ్, ఏసీపీ ఎంఏ.రెహమాన్, సీఐ సాగర్ నాయక్, నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, సీతారాములు, కోసూరి శ్రీనివాసరావు, దాసరి దానియేలు, కట్ల సంతోష్, మట్టూరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

హైవేలకు ఇరువైపులా సర్వీసు రోడ్లు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం – విజయవాడ, నాగపూర్ – అమరావతి హైవేలకు ఇరువైపులా జిల్లా సరిహద్దుల వరకు రైతులు పొలాల్లోకి వెళ్లేలా సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ అధికారులతో సమావేశమయ్యారు. హైవేల నిర్మాణం సాగుతున్నందున సర్వీసు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పిస్తే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ధంసలాపురం – బోనకల్ రోడ్డు దగ్గర ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లు, సర్వీస్ రోడ్లకు అనుమతి మంజూరైందని చెప్పారు. కాగా, ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యాన ఖమ్మం–అశ్వారావుపేట రహదారిపై గుంతలను పూడ్చాలని మంత్రి సూచించారు.

నయనానందకరం... నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి నిత్యకల్యాణం గురువారం నయనానందకరంగా సాగింది. తొలుత గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితరపూజలు నిర్వహించారు. ఆతర్వాత బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోత్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

కళ.. ఆకట్టుకునేలా..



ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉంటాయి. ఇతరులతో కలిసేందుకు పెద్దగా ఇష్టపడని ఆదివాసీలు తమ కట్టుబాట్లతో ప్రత్యేకంగా నిలుస్తారు. తరాలు మారుతున్న నేపథ్యాన వారు సైతం స్వతహాగా తమలో ఉన్న కళలకు పదును పెడుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. వీరి జీవనశైలినే బొమ్మల రూపంలో తీర్చిదిద్ది ప్రతిఒక్కరూ అబ్బురపడేలా చేస్తున్నారు. అలా ఆదివాసీల కొయ్య బొమ్మలు భద్రాచలం ఐటీడీఏలో కొలువు దీరాయి. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈ అంశంపై కథనం. – భద్రాచలం

చెక్కతో చేసిన గణపతి బొమ్మకు తుదిరూపు ఇస్తున్న కళాకారుడు

- అబ్బురపరుస్తున్న ఆదివాసీ కళాకారులు
- కొండపల్లిని మించి ఆకట్టుకునేలా కొయ్యబొమ్మల తయారీ
- కాస్త చేయూతనిస్తే సత్తా చాటడం ఖాయం
- విక్రయ కేంద్రాల ఏర్పాటు, నిరంతర శిక్షణతో మరింత ఊపు

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఐటీడీఏలో వర్క్‌షాప్

ఆదివాసీ, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి అందించాలనే లక్ష్యంతో భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియం ఏర్పాటుచేశారు. ఇందులో గిరిజన, ఆదివాసీలు వాడిన వస్తువులు మొదలు వేషధారణ, ఇంటి, పొలం సామాగ్రితో పాటు బుర్రలు, కొమ్ములు వంటి అన్ని రకాల వస్తువులను ఉంచారు. ఇంతటితో సరిపెట్టకుండా ఆదివాసీల జీవన విధానం, కట్టుబాట్లను బొమ్మల రూపంలో అందుబాటులోకి తీసుకొస్తే మరింత ప్రాచుర్యం దక్కడమే కాక నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందనే భావనతో మ్యూజియం పక్కనే కొయ్య బొమ్మల వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. ఇందులో ఆదివాసీ కళాకారులు చెక్కతో బొమ్మలను అందంగా చెక్కుతున్నారు. వీటిని భద్రాచలం ఐటీడీఏ, శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి వచ్చే అతిథులకు జ్ఞాపికలుగా ఇస్తుండడంతో కళారూపాలు రాష్ట్రం, దేశం దాటుతున్నాయి.

ఆదరిస్తే... అంతర్జాతీయ స్థాయికే

ఆదివాసీలు కొయ్య బొమ్మలు రూపొందిస్తున్న విషయానికి మరింత ప్రాచుర్యం కల్పిస్తే ఆదరణ లభించే అవకాశముంది. కొండపల్లి, నిర్మల్ కొయ్య బొమ్మల మాదిరిగానే ఇవి ఉన్నప్పటికీ భిన్నమైన సంస్కృతిని ప్రతిబింబిస్తుండడంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకుకెళ్లవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఇద్దరు ఆదివాసీ కళాకారులు వీటిని రూపొందిస్తుండగా.. మరికొందరు శిక్షణ పొందుతున్నారు. డిమాండ్, ఆర్డర్ల ఆధారంగా వీటిని తయారు చేస్తున్న కళాకారులు.. ఎగ్జిబిషన్లు, ఇతర కళాజాతరల సమయాన మంచి ఆదరణ లభిస్తోందని చెబుతున్నారు.

విక్రయిస్తే బాగు...

ప్రస్తుతం కొయ్య బొమ్మలకు సంబంధించి ఐటీడీఏలో తప్ప మరెక్కడా విక్రయ కేంద్రాలు లేవు. భద్రాచలానికి భక్తులతో పాటు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీరందరికి బొమ్మలను అందుబాటులోకి తీసుకొచ్చేలా రామాలయం వెళ్లే దారి, ఆలయం సమీపాన కూడా విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేస్తే ఆదరణ పెరిగే అవకాశముంది. అంతేకాక రామాలయానికి వచ్చేవారికి ఐటీడీఏలో మ్యూజియం ఉందనే విషయం తెలిసేలా ప్రచారం చేయడమే కాక రవాణా సౌకర్యం కల్పిస్తే అందరూ వెళ్లి చూడడంతో కాక ఆసక్తి ఉన్నవారు బొమ్మలు కొనుగోలు చేస్తారు. తద్వారా ఆదివాసీలకు ఉపాధి లభించడమే కాక కళకు మరింత ప్రాచుర్యం దక్కుతుంది. ఇక కొయ్యబొమ్మల తయారీపై ఆదివాసీ యువతకు వర్క్‌షాప్‌లు, వైటీసీలో కోర్సులు మొదలుపెట్టాలనే సూచనలు కూడా వస్తున్నాయి.

పీఓ రాహుల్ ప్రత్యేక దృష్టి

ఐటీడీఏ పీఓగా కొన్నాళ్ల క్రితం బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మ్యూజియంతో పాటుగా కొయ్య బొమ్మల తయారీపై దృష్టి సారించారు. ఇప్పటికి పలుమార్లు కేంద్రాన్ని సందర్శించి కళానైపుణ్యాన్ని అభినందించారు. అలాగే, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా మేళా ఏర్పాటు చేయించారు. వీటికి తోడు విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేయించి ఆదివాసీ యువతకు శిక్షణ ఇప్పించాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరుతున్నారు.



కొయ్య బొమ్మలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్ (ఫైల్)

బియ్యం పంపిణీ ఎప్పుడో?

జిల్లాలో లబ్ధిదారుల ఎదురుచూపులు

ఖమ్మం సహకారనగర్: రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. ఈనెల 8వ తేదీ వచ్చినా చాలా దుకాణాలకు బియ్యం సరఫరా కాలేదు. జిల్లాలో 748 రేషన్ దుకాణాలు ఉండగా సుమారు 500 దుకాణాలకే బియ్యం అందినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతీనెల 1నుంచి 15వ తేదీ వరకు మాత్రమే లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించింది. గత నాలుగు నెలలుగా 1వ తేదీకి ముందుగానే షాపులకు బియ్యం చేరుతుండడంతో సాఫీగానే సరఫరా చేస్తున్నారు. అయితే, మూడు నెలలుగా సూర్యాపేట జిల్లా నుంచి వస్తున్న బియ్యం నాణ్యతపై లబ్ధిదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమైనట్లు తెలిసింది. దీంతో ఈ నెల కరీంనగర్ జిల్లా నుంచి తీసుకొస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా నాలుగు రోజులుగా వర్షాలు కురవడం, తదితర కారణాలతో సరఫరాలో ఆలస్యమైనట్లు తెలిసింది. దీంతో 8వ తేదీ వచ్చినా చాలా షాపులకు బియ్యం చేరకపోగా లబ్ధిదారులకు అందలేదు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీలతను వివరణ కోరగా.. వరుస సెలవులు, వర్షాల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి బియ్యం సరఫరాలో జాప్యం జరిగిందని.. రెండు రోజుల్లోగా అన్ని షాపుల ద్వారా పంపిణీ చేస్తామని వెల్లడించారు.

క్లుప్తంగా

జ్వరాల తీవ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా



నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ మాలతి

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లి, పాతర్లపాడు గ్రామాల్లో ఇటీవల పలువురు డెంగీ, ఇతర జ్వరాల బారిన పడగా పరిస్థితులను తెలుసుకునేందుకు డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి గురువారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే చేపట్టి జ్వరాల తీవ్రతపై ఆరా తీశారు. అలాగే, డెంగీ బారిన పడి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. మరోపక్క ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, మండల ప్రత్యేకాధికారి విజయనిర్మల ఆధ్వర్యాన పారిశుద్ధ్య కార్యక్రమాల్లో వేగం పెంచారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించడంతో పాటు డ్రెయినేజీలు శుభ్రం చేయించారు. అనంతరం పిండిప్రోలులో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ వైద్య సిబ్బందితో సమావేశమై సూచనలు చేశారు. స్థానిక పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చదును చేయించాలని పంచాయతీ కార్యదర్శి బాలాజీని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీఓ సూర్యనారాయణ, ఏఎన్ఎం సీత తదితరులు పాల్గొన్నారు.

'గానకోకిల' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంగాంధీచౌక్: సామాజిక సమస్యలపై పాటల ద్వారా ప్రజల్లో అవగాహన తీసుకొస్తున్న గాయకులకు 'గానకోకిల' పురస్కారాలు అందించనున్నట్లు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ సంస్థ కన్వీనర్ కోమాకుల సీతారాములు, కోకన్వీనర్లు కామిరె సాకీ, నిర్మల తెలిపారు. పాటల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేసిన వారు, సామాజిక సమస్యలపై పాడిన ఉమ్మడి జిల్లాలోని గాయనీ, గాయకులు వివరాలను 83747 93374, 99088 04755 నంబర్లకు వాట్సాప్ ద్వారా ఈనెల 12లోగా పంపించాలని సూచించారు. ఎంపిక చేసిన వారికి ఈనెల 18న అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీల నిర్వహణకు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం ముస్తాబైంది. 'నెలనెలా వెన్నెల' సంస్థ ఏడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ(ఆర్క్స్), ఖమ్మం కళా పరిషత్, ప్రజా నాట్యమండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు శుక్రవారం సాయంత్రం ప్రారంభమవుతాయి. తొలిరోజు వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ కళా బృందంచే రాత, హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ సంస్థ ఆధ్వర్యాన మూల్యం, వీరన్నపాలెం కళానికేతన్ సంస్థ ఆధ్వర్యాన రాజుగారి గోచి నాటికలను ప్రదర్శిస్తారు. కాగా, ఖమ్మం కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు వీ.వీ.అప్పారావును 'స్తంభాద్రి' అవార్డుతో సత్కరించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు కళాభిమానులు, కళాకారులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, కె.దేవేంద్ర, వీ.వీ.అప్పారావు, డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేత, నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం కోరారు.

డీసీఎంపై దుండగులు రాళ్లదాడి

రఘునాథపాలెం: ఖమ్మం వైపు నుండి వైజాగ్ వైపు వెళ్తున్న డీసీఎంపై బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు రాళ్లతో దాడి చేసి దోపిడీకి యత్నించారు. ఈ ఘటన రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలోని కలెక్టరేట్ వద్ద చోటుచేసుకుంది. భువనగిరికి డ్రైవర్ రమేశ్ డీసీఎంలో హైదరాబాద్ నుంచి వైజాగ్‌వెళ్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి కలెక్టరేట్ సమీపానికి చేరుకోగానే ఆటోలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని అడ్డుకుని డ్రైవర్‌పై రాళ్లతో దాడి చేశాడు. దీంతో గాయపడిన ఆయన దోపిడీ యత్నం జరుగుతుందనే అనుమానంతో డీసీఎంను ఖమ్మం వైపు మళ్లించాడు. అయినా దుండగులు వెంటాడినట్లు బాధితుడు తెలిపాడు. అదే మార్గంలో వెళ్తున్న మరో లారీపైనా వారు రాళ్లతో దాడి చేశారని వెల్లడించారు. ఘటనపై రమేశ్ ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రఘునాథపాలెం పోలీసుస్టేషన్‌కు కేసు బదిలీ చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	6,000
మిర్చి	17,100	13.500
మిర్చి తాలు	9,000	9,000
ఏసీ మిర్చి	19,600	10,000
ఏసీ తాలు	9,000	9,000
పత్తి	7,250	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,828

నాడు వైఎస్సార్ హయాంలో..



వైఎస్సార్ హయాంలో నిర్మించిన రిజర్వాయర్ అదనపు అలుగు

- వైరా రిజర్వాయర్ అభివృద్ధి బాటలు
- మళ్లీ ఇన్నేళ్ల తర్వాత నిధుల మంజూరు
- నేడు పనులకు శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి

వైరా: సుస్థిర పాలనకు తోడు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అప్పట్లో వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. అధికారంలోకి రాక ముందు 2004లో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా వైఎస్సార్ వైరా రిజర్వాయర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక 2009 జనవరి 4వ తేదీన మధిర నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సమయంలో రిజర్వాయర్ అభివృద్ధికి రూ.50.43 కోట్లు మంజూరు చేయగా ఆయకట్టు చివరి భూములకూ నీరందింది. ఆతర్వాత రిజర్వాయర్ నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోగా.. మళ్లీ ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిధులు మంజూరయ్యాయి.

రూ.50.43 కోట్లు మంజూరు చేసిన వైఎస్

వైరా రిజర్వాయర్ ద్వారా తొలినాళ్లలో 17వేల ఎకరాల ఆయకట్టు ఉండేది. అయితే, వైరా, తల్లాడ, బోనకల్ మండలాల్లోని చివరి ఆయకట్టుకు సరిగ్గా నీరందేది కాదు. పాదయాత్రలో రైతుల ఆవేదన గుర్తించిన వైఎస్ ముఖ్యమంత్రి అయ్యాక రిజర్వాయర్ ఆధునికీకరణకు రూ.50.43 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో రిజర్వాయర్ కాలువలకు గైడ్ వాల్స్, లైనింగ్ నిర్మాణాలు చేపట్టడమే కాక అదనపు అలుగు నిర్మించారు. దీంతో నీరు సాఫీగా సాగుతూ ఆయకట్టు 25వేలకు పెరిగింది.

నైజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయంలో నిర్మించిన వైరా రిజర్వాయర్ వైఎస్ హయాంలో అభివృద్ధికి నోచుకోగా.. వైఎస్ అనంతరం ఎవరూ పట్టించుకోకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు చేరడంలో ఇక్కట్లు మొదలయ్యాయి.

తాజా బడ్జెట్‌లో రూ.42.10కోట్లు

ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో వైరా మండలం స్నానాల లక్ష్మీపురానికి చెందిన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగానే కాక ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వైరా రిజర్వాయర్ ఆధునికీకరణకు రూ.42.10కోట్లు కేటాయించారు. ఈ నిధులతో రిజర్వాయర్ కాల్వల రెండో దశ ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. ఎడమ కాల్వ పరిధిలో 9.5 కి.మీ. నుండి 13.5 కి.మీ. వరకు, కుడి కాల్వ పరిధిలో 7.8 కి.మీ. నుండి 20.8 కి.మీ. వరకు రెండు వైపులా సీసీ లైనింగ్ నిర్మిస్తారు. ఆపై విప్పలమడక, లింగన్నపేట గ్రామాల మధ్య 6వ నంబర్ తూము వద్ద మరికొన్ని పనులు చేపట్టనున్నారు. ఇవన్నీ పూర్తయితే దాచాపురం, గన్నవరం, పాలడుగు, గరికపాడు, గొల్లపూడి చివరి భూములకు కూడా సారు నీరు అందనుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, శుక్రవారం వైరా రిజర్వాయర్ ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, రూ.37.50 కోట్లతో నిర్మించే 100 పడకల ఆస్పత్రి భవనం, రూ.26.87 కోట్లతో అమృత్ 2.0 పథకం పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో వైరా నది సమీపాన స్నానఘట్టాలు, చెక్ డ్యాం, రిటైనింగ్ వాల్ నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేయనున్నారు.

సమగ్రంగా వ్యర్థాల నిర్వహణ



మెడికల్ కాలేజీలో మొక్క నాటుతున్న గౌతమ్, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్, ప్రిన్సిపాల్ రాజేశ్వరరావుతదితరులు

- కుక్కల శస్త్రచికిత్సకు మరో కేంద్రం
- గడువులోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన
- కేఎంసీ అధికారులతో సమీక్షలో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారి గౌతమ్

ఖమ్మంమయూరిసెంటర్: చెత్త సేకరణ సమయంలోనే వ్యర్థాలను వేరు చేసి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, జిల్లా ప్రత్యేకాధికారి వీ.పీ.గౌతమ్ సూచించారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కేఎంసీ ఆధ్వర్యాన చేపట్టిన ర్యాలీని మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి గౌతమ్ ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు, మెప్మా ఆర్పీలు ఈ ర్యాలీలో పాల్గొనగా గౌతమ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

డంపింగ్‌యార్డ్ సందర్శన

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గౌతమ్.. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి డంపింగ్‌యార్డ్‌ను సందర్శించారు. డంపింగ్‌యార్డ్‌లో నిల్వ ఉన్న వ్యర్థాల బయోమైనింగ్ వివరాలు తెలుసుకున్నారు. ఇంకా 2.64 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు బయోమైనింగ్ చేయాల్సి ఉందని అధికారులు వివరించారు. అనంతరం కేఎంసీలో అధికారులతో సమావేశమైన వీ.పీ.గౌతమ్ పన్నుల వసూళ్లు, భువన్ సర్వే వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన సిబ్బందిని నియమించుకుని సర్వే పూర్తి చేయాలని, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని, శిథిల భవనాలను తొలగించాలని సూచించారు. కుక్కల శస్త్రచికిత్సల కోసం అదనంగా ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ ఏ.సంపత్‌కుమార్, ఈఈ కృష్ణాలాల్, ఆర్ఓ జి.శ్రీనివాస్, డీసీపీ వికాస్, డీఈ ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలు అక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లాకు గురువారం జిల్లా ప్రత్యేకాధికారి గౌతమ్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కేఎంసీ అభిషేక్ ఆగస్త్య మంత్రిని కలవగా ఆయన మాట్లాడారు. భూముల సంరక్షణ, గోళ్లపాడు చానల్ పనులు, వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి, సీఎం పర్యటన ఏర్పాట్లు, ఖమ్మంలో మరో ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణానికి స్థల సేకరణపై సూచనలు చేశారు.

మెడికల్ కాలేజీలో వనమహోత్సవం

ఖమ్మంవైద్యవిభాగం: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ మొక్కలు నాటారు. ఈసందర్భంగా 65 మొక్కలు నాటగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట, మేయర్ పి.నీరజ, కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలుగు పోస్తున్న వైరా రిజర్వాయర్

వైరా: రెండు నెలలుగా అన్నదాతలు ఎదురుచూస్తున్న సమయం వచ్చేసింది. గతనెలలో జిల్లావ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురిసినా వైరా రిజర్వాయర్‌లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. దీంతో ఖరీఫ్ సాగుకు నీలినీడలు కమ్ముకున్నాయి. ఇంతలోనే వారం రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో వైరా రిజర్వాయర్‌లోకి వరద వచ్చి చేరుతుండగా.. గురువారం పూర్తిస్థాయి నీటిమట్టమైన 18.3 అడుగులు దాటి 18.9 అడుగులకు చేరడంతో నాలుగు అలుగులు ద్వారా 790 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది. ఇప్పటికే కుడి, ఎడమ కాల్వల ద్వారా పంట పొలాలకు అధికారులు సాగునీరు విడుదల చేసిన నేపథ్యాన రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

20 అడుగులకు చేరిన పాలేరు

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం గురువారం 20అడుగులకు చేరింది. సాగర్ నుండి వస్తున్న ఇన్‌ఫ్లో 3,591క్యూసెక్కులకు పెరగగా... 23అడుగుల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ జల కళ సంతరించుకుంది. కాగా, రిజర్వాయర్ నుండి ఎడమ కాల్వకు 2,100 క్యూసెక్కులు, పాలేరు పాత కాల్వకు 320 క్యూసెక్కులు, భక్తరామదాసు ప్రాజెక్టుకు 275 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.



రిజర్వాయర్ అలుగు ద్వారా బయటకు వెళ్తున్న నీరు

ఎన్‌బీసీ కెనాల్‌కు నీటి విడుదల

నేలకొండపల్లి: నందిగామ బ్రాంచి కెనాల్(ఎన్‌బీసీ)కు ఇరిగేషన్ అధికారులు గురువారం నీటిని విడుదల చేశారు. మండలంలోని అమ్మగూడెం వద్ద సాగర్ ప్రధాన కాల్వ నుంచి లాక్‌లు ఎత్తి నందిగామ బ్రాంచ్‌కు నీటిని విడుదల చేయగా ఇరిగేషన్ ఉద్యోగి ఖలీల్‌పాషా మాట్లాడారు. రైతులు నీరు వృథా కాకుండా చూస్తూ పంటల సాగుకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లష్కర్లు రంగయ్య, పాషా, నాయకులు గండు సతీష్, లఘుపతి, వాసంశెట్టి మోహన్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరనిలోటు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు, పశ్చిమబెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య మృతిపై పార్టీ నాయకులు సంతాపం ప్రకటించారు. భట్టాచార్య మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని, 2000 నుండి 2011 వరకు పశ్చిమ బెంగాల్ సీఎంగా సేవలందించారని కొనియాడారు. ఈమేరకు సీపీఎం జిల్లా కమిటీ తరఫున భట్టాచార్య మృతిపై సంతాపం ప్రకటిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

జాతీయస్థాయి ఎన్‌సీసీ పోటీలకు త్రివేణి విద్యార్థి

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని త్రివేణి పాఠశాల విద్యార్థి డార్విన్ బాలాజీ ఈనెల 27 నుంచి 31 వరకు భోపాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి ఎన్‌సీసీ పోటీలకు అర్హత సాధించాడు. గత ఏడాది డిసెంబర్ 5న గైడ్ టీచర్ కె.రోశయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్ బేగంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించగా జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. బాలాజీ సమర్పించిన 'సొల్యూషన్స్ టు ద కన్వర్జేషన్ ఆఫ్ బయోడైవర్సిటీ ఫ్రమ్ ద గ్రానైట్ ఎగ్జాస్టర్స్' ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈసందర్భంగా బాలాజీని పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్నతో పాటు ముస్తఫా, శ్రీదేవి, చార్లెస్, సందీప్ అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్లు

గొలుసు వివాదం

నేలకొండపల్లి: పూలమొక్కల విషయమై జరిగిన గొడవలో గొలుసులు పోయాయని ఇద్దరు మహిళలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేలకొండపల్లికి చెందిన ఇద్దరు మహిళలు గత ఆదివారం పూల మొక్కల విషయమై పంచాతీ పెట్టుకున్నారు. ఒక దశలో ఇరువురు దాడి చేసుకోగా ఒకరి గొలుసు పోయింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆపై పెద్దల సమక్షాన సోమవారం, గురువారం పంచాయితీ నిర్వహించగా అక్కడా ఇద్దరు గొడవపడ్డారు. చివరకు తన బంగారు గొలుసు సైతం పోయిందని మరో మహిళ కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి

ముదిగొండ: ప్రమాదవశాత్తు ఓ యువకుడు బావిలో పడి మృతి చెందాడు. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన మామిడి సాయి(21) తమ పొలంలో వరినారు కట్టలు వేయడానికి వెళ్లి పనులు ముగిశాక వాగులో కాళ్లు కడుక్కోవడానికి వెళ్లాడు. ఆ సమయాన ప్రమాదవశాత్తు వాగులో లోతుగా తీసిన బావిలో కాలు జారి పడగా ఆయనకు ఈత రాకపోవడంతో మృతి చెందాడు. స్థానికులు ఆయన మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటనపై ఎస్ఐ నరేష్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



సాయి (ఫైల్)

మంత్రి పొంగులేటి ప్రయాణంలో అపశృతి

వైరారూరల్: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రయాణిస్తున్న వాహనం టైర్ గురువారం ఉదయం వైరా సమీపాన జాతీయ ప్రధాన రహదారిపై పంక్చర్ అయింది. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మంత్రి ఖమ్మం నుంచి బయలుదేరారు. ఆయన కాన్వాయ్ వైరా మండలం స్టేజీ పినపాక సమీపాన హైలెవల్ వంతెన దిగాక జాతీయ ప్రధాన రహదారిపై మంత్రి ఉన్న ల్యాండ్ క్రూజర్ కారు టైరు పంక్చర్ అయింది. దీంతో డ్రైవర్ అప్రమత్తమై వెంటనే నిలిపివేశారు. ఆ తర్వాత పొంగులేటి కాన్వాయ్ జాతీయ రహదారిపై కొద్దిసేపు నిలిచిపోగా.. మంత్రి మరో వాహనంలో అక్కడి నుంచి ప్రగడవరం బయలుదేరారు.



పంక్చర్ అయిన వాహనం

ఆర్టీసీ కార్గోలో మత్తుపదార్థాలు

స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఇల్లెందు: ఆర్టీసీ కార్గో ద్వారా మత్తు పదార్థాలు రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఇల్లెందులో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇల్లెందుకు చెందిన వ్యాపారి ఎ.నాగేశ్వరరావు కరీంనగర్ నుంచి ఆర్టీసీ కార్గోలో పార్సిళ్లు తెప్పించారు. వీటిని లలిత కళామందిర్ రోడ్డులోని ఇంటికి చేర్చే క్రమాన పోలీసులు తనిఖీ చేయగా రూ.35వేల విలువైన పొగాకు, గోల్డెన్ జర్దా, కాశ్మీరీ కిమామ్, ఆర్ఎండీ, అంబర్ తదితర గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. దీంతో వ్యాపారిపై కేసు నమోదు చేసి సరుకు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

కార్యమేదైనా.. డోలు మోతే!

- ఆదివాసీల సంస్కృతితో విడదీయలేని బంధం
- బాజాభజంత్రీలకు ఆది నుంచి దూరమే..
- చప్పుడు ఉంటేనే ఊపు, ఉత్సాహం

గుండాల: ఆదివాసీ పల్లెల్లో డోలు మోగిందంటే ఐదు కి.మీ. దూరం వరకు వినిపిస్తుంది. అది విన్న గిరిజనులు అక్కడ చావో, పండగో జరుగుతుందని భావిస్తారు. ఆదివాసీలు తరతరాలుగా మంచి, చెడు ఏ కార్యక్రమమైనా డోలు వాయించడం ఆచారంగా కొనసాగిస్తున్నారు. ప్రతీ గిరిజన గ్రామంలో వనదేవతలు, విత్తన పండగలు, కొత్తపోడి(పంటకోతలు), గ్రామదేవతలతో పాటు ఇతర జాతర్లలో డోలుదే ప్రధాన భూమిక. గిరిజనులు మరణిస్తే కర్మలకు తప్పకుండా రెండు రోజుల పాటు డోలు మోగాల్సిందే. ఇటీవల పార్టీల ర్యాలీలు, విజయోత్సవ ర్యాలీలు, హోలీ సంబరాలకు సైతం డోలు వాయించేందుకు ఆదివాసీ గిరిజనులను ప్రత్యేకంగా పిలిపిస్తున్నారు.

తయారీ ఇలా...

అడవుల్లో లభించే అందుగు మొద్దులను సేకరిస్తారు. వీటి తొడుగు(చెక్కను), లోపల గుజ్జు పూర్తి తొలగిస్తారు. ఏ సైజులో కావాలంటే ఆ సైజ్‌లో కోసి రెండు వైపులా జంతు చర్మాలతో మూసివేస్తారు. ఆపై ఎక్కువ చప్పుడు వచ్చేలా తాళ్లను గట్టిగా లాగి కడతారు. దీంతో డోలు సిద్ధమవుతుంది.

చిన్నాపెద్ద తేడా లేదు..

ఖరీఫ్ సీజన్ ఆరంభంలో విత్తనపు పండుగకే కాక పంట చేతికొచ్చాక ఆదివాసీల కొత్తపోడి పండుగ జరుపుకుంటారు. అతర్వాత పెళ్లిళ్ల జోరందుకుంటుంది. వీటి మధ్య వచ్చే జాతరలు, విగ్రహ ప్రతిష్ఠాపనలకే కాక కర్మలకు డోలు మోగుతుంది. ఈ చప్పుళ్లతో గిరిజనుల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా దరువేస్తారు. ముఖ్యంగా జాతరలు, ఇతర పండుగ సందర్భాల్లో డోలు చప్పుడు వింటే ఎంతటివారైనా చిందేయాల్సిందే. పెళ్లిళ్ల సందర్భాన భాజా, భజంత్రీలను కేవలం తాళి కట్టేంత వరకు ఉపయోగిస్తారు. ఆదివాసీ గిరిజనులు తాతముత్తాల కాలం నుంచి ఇదే సంప్రదాయాన్ని పాటిస్తుండగా.. డోలు లేకుండా ఏ చిన్న కార్యక్రమమైనా జరగదనే చెప్పాలి.



డోలు మోగిస్తున్న ఆదివాసీలు (ఫైల్)

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



పండుగ చేసుకుందాం!

విత్తు నాటినా, పంట చేతికొచ్చినా ఆదివాసీ పల్లెల్లో సంబురమే

హిందూ సంప్రదాయ పద్ధతిలో ఏటా వచ్చే పండుగల మాదిరిగానే ఆదివాసీ గ్రామాల్లోనూ ప్రత్యేక పండుగలు జరుపుకుంటారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి జరిపే పండుగలకు ప్రత్యేకత ఉంటుంది. విత్తు నాటింది మొదలు.. పంట చేతికొచ్చే వరకు విత్తనాల పండుగ, సాలు దేవర, కొత్తపోడి ఇలా మూడు రకాల పండుగలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పండుగలతో ఖరీఫ్ వచ్చిందంటే చాలు ఆదివాసీ గిరిజన గ్రామాల్లో సందడి నెలకొంటుంది.

విత్తనాల పండుగ

అటవీ ఉత్పత్తులు, తునికాకు సేకరణ అయిపోతుండగానే ఖరీఫ్ వస్తుంది. ముందుగా వేసవి దుక్కులు చేసుకుని వర్షాలు పడుతుండగానే విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతారు. దీనికి ముందు గిరిజనులంతా ముత్యాలమ్మ, బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. తమ సంప్రదాయం ప్రకారం విత్తనాలను కుల, వన, గ్రామ దేవతల వద్ద ఉంచి కోళ్లు, మేక, పంది ఇలా ఒక్కొక్కరు ఒక్కో రీతిలో బలి ఇస్తారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు బాగా పండాలని వేడుకుంటారు.

సాలు దేవర

విత్తనాలు భూమిలో వేశాక సాలు దేవర పండుగ నిర్వహిస్తారు. ఏదో ఒక జంతువును బలిచ్చి ఆ నైవేద్యం పంటలపై చల్లుతారు. పంటలు ఏపుగా పెరగాలని, పూత, కాపు మంచిగా రావాలని, మంచి దిగుబడులు రావాలని సాలు దేవరను వేడుకుంటారు. సాగు చేసే పంట చేన్ల వద్దే ఈ పండుగ గ్రామస్తులంతా కలిపి జరుపుకుంటారు.

కొత్తపాడి

పంట మొదటి దశ చేతికి రాగానే మూడో పండుగగా కొత్తపాడి నిర్వహిస్తారు. ఈ పండుగ చేశాకే ఆ పంటను తినడం ప్రారంభిస్తారు. కొత్తపాడి చేయనిదే ఆదివాసీలు పంటను కోయడం, తినడం కానీ చేయరు. మొక్కజొన్న, పెసర, ఇతర పంటలు దసరా నాటికి చేతికొస్తాయి. గిరిజనులు పంటతో నైవేద్యం వండి దేవతలకు పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. అయితే గ్రామంలో ఏ రైతు పంట ముందుగా చేతికొస్తే ఆ రైతు తమ కుటుంబంలో పండుగ జరుపుకుంటారు. ఈ పండుగలు నిర్వహించే క్రమాన గ్రామ గిరిజనులంతా కలిసి డోలు చప్పుళ్ల నడుమ నృత్యాలు చేసుకుంటూ ఆదివాసీ దేవతలను వేడుకుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈ పండుగలు చేయడం మర్చిపోరు. ఇవేకాక ఇతర పండుగలనూ ఆదివాసీలు జరుపుకుంటారు.